క్లుప్తంగా

ఉగ్రవాదంపై ఉక్కుపాదం మోపాలి



డీఆర్‌ఓకు వినతిపత్రం ఇస్తున్న పట్నాయక్ తదితరులు

బోట్‌క్లబ్: ప్రభుత్వం ఉగ్రవాదంపై ఉక్కు పాదం మోపాలని విశ్వ హిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు రాజమహంతి రవిశంకర్ పట్నాయక్ అన్నారు. స్థానిక కలెక్టర్ కార్యాలయంలో జిల్లా రెవెన్యూ అధికారి రమణికి బుధవారం వినతిపత్రం సమర్పించారు. కాశ్మీర్‌లో హిందూ భక్తుల బస్సుపై ఉగ్రవాదుల దాడి సహించరానిదని, ఇటువంటి చర్యలు జరగకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట జిల్లా భజరంగదళ్ కార్యదర్శి తోట రామకృష్ణ, పరిషత్ సభ్యులు కోక మాలతీదేవి, గంధం గోవిందు, జీయా భానోజీరావు, శ్రీకాంత్ పాల్గొన్నారు.

సినారెకు ఘన నివాళులు



సినారె చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రముఖులు

కాకినాడ రూరల్: సినీ గేయ రచయిత సి.నారాయణరెడ్డి వర్ధంతి స్థానిక సర్పవరం జంక్షన్‌లోని బోట్‌క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆధ్యాత్మిక వేత్త వేదుల శిరీష, అడబాల రత్నప్రసాద్, బుద్ధరాజు సత్యనారాయణరాజు, శ్రీనగేష్, రెడ్నం రాజా, సత్యనారాయణ తదితరులు సి.నారాయణరెడ్డి చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సినిమాల్లో మూడు వేలకు పైగా పాటలు రాసిన సినారె పద్మశ్రీ, పద్మభూషణ్, కళాప్రపూర్ణ పురస్కారాలతో పాటు, జ్ఞానపీఠ్ అవార్డునూ అందుకున్నారని కొనియాడారు. ఆయన 2017 జూన్ 12న తుదిశ్వాస విడిచారని శ్రద్ధాంజలి ఘటించారు.

ప్రమాణ స్వీకార వీక్షణకు ఏర్పాట్లు



కరప ఎంపీడీఓ కార్యాలయంలో సీఎం ప్రమాణ స్వీకారాన్ని తిలకిస్తున్న అధికారులు, సిబ్బంది

కరప: ప్రభుత్వ ఆదేశాల మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఇతర మంత్రుల ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని తిలకించేందుకు మండలంలోని ప్రభుత్వ, పంచాయతీ కార్యాలయాల్లో ఏర్పాట్లు చేశారు. కార్యాలయాలను విద్యుద్దీపాలతో అలంకరించి, ప్రత్యక్ష ప్రసారం తిలకించేందుకు ఎల్ఈడీ టీవీలు ఏర్పాటు చేశారు. బుధవారం జరిగిన రాష్ట్ర మంత్రివర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని ఎంపీడీఓ కె.అప్పారావు, ఏఓ గుత్తుల భీమశంకరరావు, ఈఓపీఆర్డీ బీఏ సత్యనారాయణ, ఏపీఓ జీవీ రమణకుమార్‌తో పాటు, కార్యాలయ, ఉపాధిహామీ పథకం సిబ్బంది తిలకించారు.


దేవస్థానం భూములకు కౌలు వేలం ఖరారు



చేబ్రోలులో బహిరంగ వేలం నిర్వహిస్తున్న దేవదాయ శాఖ అధికారులు

గొల్లప్రోలు: మండలంలోని చేబ్రోలులో సీతారామస్వామి దేవస్థానం భూములకు బుధవారం కౌలువేలం ఖరారైంది. దేవస్థానానికి చెందిన 41 ఎకరాల 85 సెంట్ల భూమికి అధికారులు బహిరంగ వేలం నిర్వహించగా, రూ.3,17,500కు ఖరారైంది. ఈ భూములకు వేలం ద్వారా గతేడాది రూ.2,94,000 ఆదాయం రాగా, ఈ ఏడాది రూ.23,500 అధికంగా ఆదాయం లభించినట్టు ఆలయ ఈఓ జి.అశ్విని తెలిపారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ అధికారులు వై.వెంకటాచార్యులు, టీవీఆర్ చౌదరి, జె.భీమశంకర నారాయణ తదితరులు పాల్గొన్నారు.

మరిడమ్మకు మఖ నక్షత్ర పూజలు



మరిడమ్మ అమ్మవారు

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా పేరొందిన పెద్దాపురం మరిడమ్మ అమ్మవారికి బుధవారం మఖ నక్షత్ర ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీ, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్‌వీ రామ్మోహనరావు ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, చండీ హోమంతో పాటు, బంగారు పుష్పాలతో పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అడ్డుకట్ట పడేనా!?

- శిథిలమైన ఎల్లేటి తూముల ఐరన్ గేట్లు
- చౌడు బారుతున్న పొలాలు
- కొత్తవి ఏర్పాటు చేయాలని రైతుల వినతి



శహపురం డ్రెయిన్‌పై ఎల్లేటి తూములకు శిథిలమైన ఐరన్ గేట్లు

కరప: తుల్యభాగలో కలిసే శహపురం డ్రెయిన్‌పై ఉండే ఎల్లేటి తూములు శిథిలమయ్యాయి. సముద్రం పోటు నీటికి పొలాలు చౌడుదేరుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. శహపురం డ్రెయిన్‌పై ఉన్న ఎల్లేటి తూములు (ఫ్లాపి షట్టర్స్) శిథిలావస్థకు చేరడం వల్లే సారవంతమైన పొలాలు చౌడు భూములుగా మారుతున్నాయని రైతులు గగ్గోలు పెడుతున్నారు. సముద్రం నుంచి వచ్చే పోటు నీరు డ్రెయిన్‌లోకి రాకుండా అడ్డుకునే ఎల్లేటి తూములు దెబ్బతిన్నా పట్టించుకోని అధికారుల తీరుపై రైతులు మండిపడుతున్నారు.

కీలకమైన డ్రెయిన్

రెండు మండలాల్లోని పొలాల్లో మురుగు నీరు, వర్షాలు కురిసినప్పుడు వచ్చే ముంపు నీరు శహపురం డ్రెయిన్ ద్వారా ప్రవహించి, గొర్రిపూడి సమీపంలో తుల్యభాగ డ్రెయిన్‌లో కలుస్తోంది. పెదపూడి మండలంలోని శహపురం, కాండ్రేగుల, కరప మండలంలోని పేపకాయలపాలెం, కరప, వలసపాకల, వేములవాడ, పాతర్లగడ్డ గ్రామాల్లోని పంట పొలాలు శహపురం డ్రెయిన్ పరిధిలోకి వస్తాయి. శహపురం నుంచి గొర్రిపూడి వరకు ఈ డ్రెయిన్ 8.25 కిలోమీటర్లు ఉంటుంది. సుమారు 2,500 ఎకరాల్లోని మురుగు నీరు, ముంపు నీరు ఈ డ్రెయిన్ ద్వారా ప్రవహిస్తుంది.

తుప్పు పట్టిన గేట్లు

ఐరన్ గేట్లు తుప్పు పట్టి, పూర్తిగా శిథిలమయ్యాయి. దీంతో పోటునీరు డ్రెయిన్‌లోకి వచ్చి చేరుతోంది. ఈ నీటి వల్ల సారవంతమైన పంటపొలాలు చౌడుదేరుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కరప, పాతర్లగడ్డ, వేములవాడ, వలసపాకల గ్రామాలకు సంబంధించి సుమారు 1,500 ఎకరాలు పోటు నీటి వల్ల ఉప్పుకయ్యలుగా మారుతున్నాయని గగ్గోలు పెడుతున్నారు. పోటు నీరు వల్ల సారవంతమైన భూములు దెబ్బతినడమే కాకుండా, ఎకరానికి ఐదారు బస్తాల దిగుబడిని ప్రతిపంటకు కోల్పోవాల్సి వస్తోందని రైతులు చెబుతున్నారు. శహపురం డ్రెయిన్‌పై ఉన్న ఎల్లేటి తూములకు మరమ్మతులు చేయించి, కొత్త గేట్లు అమర్చాలని రైతులు కోరుతున్నారు.

బ్రిటిష్ కాలంలో ఏర్పాటు

అమావాస్య సమయంలో సముద్రం నుంచి వచ్చే పోటు నీరు శహపురం డ్రెయిన్‌లోకి రాకుండా ఉండేందుకు గొర్రిపూడి వద్ద ఐదు తూములకు ఫ్లాపి షట్టర్స్ (నీటి ప్రవాహాన్ని బట్టి వాటంతట అవే తెరుచుకుని/మూసుకుని పోయే తలుపులు) బ్రిటిష్ కాలంలో ఏర్పాటు చేశారు. వాటినే రైతులు ఎల్లేటి తూములుగా పిలుస్తున్నారు. ఐదు ఖానాలుగా విభజించి, వాటికి షట్టర్లు అమర్చి, పైనుంచి రహదారి కోసం వంతెన నిర్మించారు. శహపురం డ్రెయిన్‌లో నీటి ప్రవాహం ఎక్కువగా వస్తున్నప్పుడు ఈ షట్టర్లు ఆటోమేటిక్‌గా తెరుచుకుని, తుల్యభాగ డ్రెయిన్‌లో చేరి, పటవల వద్ద సముద్రంలో కలుస్తుంది. అమావాస్య సమయంలో సముద్రం పోటునీరు ప్రవాహానికి ఈ షెట్టర్లు మూసుకుపోయి, నీటిని కాలువలోకి రాకుండా చేస్తాయి.

పొలాలు చౌడుదేరుతున్నాయి



శహపురం డ్రెయిన్‌పై ఉండే ఎల్లేటి తూములు పూర్తిగా ధ్వంసమయ్యాయి. సముద్రం పోటునీరు పంటపొలాల్లోకి చేరడం వల్ల సారవంతమైన భూములు చౌడుబారిపోతున్నాయి. పంట భూములు దెబ్బతినడం వల్ల దిగుబడులు తగ్గి నష్టపోతున్నాం. రైతుల ఇబ్బందులను గుర్తించి, ఎల్లేటి తూములు బాగు చేయించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలి.

– బండే వీరబాబు, రైతు, వేములవాడ

కొత్త గేట్లు అమర్చాలి



తుల్యభాగ డ్రెయిన్‌లో కలిసే శహపురం డ్రెయిన్‌పై ఉండే ఎల్లేటి తూములకు ఉండే ఐరన్ గేట్లు పాడైపోవడం వల్ల పంటల పండక రైతులు నష్టపోతున్నారు. మురుగు నీటి పారుదల శాఖ అధికారులు స్పందించి, ఎల్లేటి తూములకు కొత్త ఐరన్ గేట్లు అమర్చేందుకు చర్యలు తీసుకోవాలి.

– గుత్తుల సత్తిబాబు, వేములవాడ శివారు సిరిగలపల్లిలంక

ఘాటెక్కిన ఉల్లి



కిర్లంపూడి మార్కెట్‌లో అమ్మకానికి సిద్ధంగా ఉన్న ఉల్లిపాయలు

కిర్లంపూడి: ఉల్లి మళ్లీ ఘాటెక్కింది. రోజురోజుకూ ఉల్లిపాయల ధరలు పెరగడంతో సామాన్యుడి గుండెల్లో దడ పుడుతోంది. కూరలో ఉల్లిపాయలు దాదాపు ఉండాల్సిందే. ఉల్లి లేకుండా కూర తినాలంటే ముద్ద దిగదు. కూరగాయల్లో ఉల్లే రారాజు అని చెప్పొచ్చు. అటువంటి ఉల్లిపాయల ధర ఇప్పుడు సామాన్యుడికి అందకుండా పైపైకి ఎగబాకుతోంది. మొన్నటి వరకు కిలో ఉల్లి ధర రూ.20 ఉండగా, ప్రస్తుతం మార్కెట్లో మూడో రకం ఉల్లి కూడా రూ.40 వరకూ పలుకుతోంది. దాంతో వినియోగదారులు ఉల్లిని కొనాలంటే బెంబేలెత్తుతున్నారు. ఇటీవల టమాటా కూడా ఉల్లికి జతకట్టింది. కొద్ది రోజుల క్రితం కిలో టమాటా రూ.15 నుంచి రూ.20 ఉండగా, ప్రస్తుతం రూ.60కు పెరిగింది. అల్లం ధర ఇప్పటికే చుక్కలనంటింది. ప్రస్తుతం కిలో అల్లం రూ.240 పలుకుతోంది. దాంతో పావు కిలో అల్లం కొనాలంటేనే చుక్కలు లెక్కపెట్టాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రధానంగా కూరల్లో కావలసిన ఉల్లి, టమాటా, అల్లం ధరలకు రెక్కలు రావడంతో సామాన్యుడి జేబుకు చిల్లుపడుతోంది.

పిల్లలందరూ బడిలో ఉండాల్సిందే..

మహిళా, శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారి కె.ప్రవీణ



కార్యక్రమంలో మాట్లాడుతున్న మహిళా, శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారి కె.ప్రవీణ

కాకినాడ సిటీ: బడిఈడు పిల్లలందరూ కచ్చితంగా పాఠశాలల్లో చదువుకోవాలని మహిళా, శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారి కొండా ప్రవీణ అన్నారు. అంతర్జాతీయ బాల కార్మిక వ్యవస్థ వ్యతిరేక దినాన్ని పురస్కరించుకుని బుధవారం స్థానిక దుమ్ములపేటలో జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ, కార్మిక శాఖ, సెంటర్ ఫర్ వరల్డ్ సోలిడారిటీ సంయుక్తాధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి జిల్లా బాలల పరిరక్షణ అధికారి సీహెచ్ వెంకటరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ప్రవీణ మాట్లాడుతూ సమాజంలో ప్రభుత్వం బాల బాలికల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. అదే విధంగా 14 ఏళ్ల లోపు బాలబాలికలందరికీ నిర్బంధ విద్యా చట్టం ద్వారా చదువుకునేలా చర్యలు తీసుకున్నట్టు వివరించారు. ప్రతిఒక్కరూ దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు రూపొందించిన పోస్టర్లు విడుదల చేశారు. కార్మిక శాఖ అసిస్టెంట్ కమిషనర్ బుల్లిరాణి మాట్లాడుతూ సమాజంలో 14 ఏళ్ల లోపు బాలబాలికలతో పని చేయించడం చట్టరీత్యా నేరమన్నారు. అటువంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి ఏఆర్ సుబ్రహ్మణ్యం, విద్యా శాఖకు చెందిన ఏఎల్ఎస్ హరికృష్ణ, కాకినాడ అర్బన్ సీడీపీఓ ఏ.జ్యోతి, జిల్లా బాలల పరిరక్షణ విభాగం, చైల్డ్ హెల్ప్‌లైన్ సిబ్బంది, క్రాప్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి స్వర్ణలత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి

బాలాజీచెరువు: సమాజంలో ప్రతి ఒక్కరూ బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి చేయాలని జిల్లా మహిళా, శిశు సంక్షేమ అధికారి కె.ప్రవీణ అన్నారు. ప్రపంచ బాల కార్మిక వ్యవస్థ వ్యతిరేక దినాన్ని పురస్కరించుకుని స్థానిక ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాలలో బుధవారం సదస్సు నిర్వహించారు. ప్రవీణ మాట్లాడుతూ హెల్ప్‌లైన్ నంబర్ 1098తో పాటు 181పై అవగాహన ఉండాలని చెప్పారు. ముఖ్యంగా బాల్య వివాహాలు అరికట్టడానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. మహిళా కళాశాల ప్రిన్సిపాల్ కరుణ మాట్లాడుతూ తల్లిదండ్రుల నిరక్షరాస్యతే పేదరికానికి ముఖ్య కారణమన్నారు. బాలికలు చదువుకుంటేనే సమాజాభివృద్ధి సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ నాగ శ్రీకాంత్, పీఓ సురేఖ, పీడీ సత్యవతి పాల్గొన్నారు.

బాల కార్మికుల గుర్తింపునకు తనిఖీలు



సదస్సులో మాట్లాడుతున్న వెంకట్రావు

కాకినాడ రూరల్: జిల్లాలో బాల కార్మికుల గుర్తింపునకు ఆకస్మిక తనిఖీలు చేపడుతున్నామని జిల్లా బాలల సంక్షేమాధికారి సీహెచ్ వెంకట్రావు అన్నారు. అంతర్జాతీయ బాల కార్మిక వ్యవస్థ వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని సర్పవరం జంక్షన్‌లోని బోట్‌క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. తల్లిదండ్రుల పేదరికం, నిరక్షరాస్యత కారణంగా ఎందరో బాలలు బాల కార్మికులుగా కాలం వెళ్లదీస్తున్నారని చెప్పారు. కొన్ని సందర్భాల్లో పెద్దలు చేయాల్సిన పనులు పిల్లలతోనే చేయిస్తున్నారన్నారు. 14 ఏళ్లలోపు పిల్లలందరికీ ఉచిత నిర్బంధ విద్యను అమలు చేయాలని రాజ్యాంగం పేర్కొందన్నారు. ఆ దిశగా బడి ఈడు పిల్లలందరినీ స్కూళ్లలో చేర్పించాలని కోరారు. 14 ఏళ్ల లోపు పిల్లలతో పని చేయించడం నేరమన్నారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు అడబాల రత్నప్రసాద్, బుద్ధరాజు సత్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన సేవలు అందించండి

- లేదంటే చర్యలు తప్పవు
- కార్యదర్శులతో కమిషనర్ జె.వెంకటరావు



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ జె.వెంకటరావు

కాకినాడ: ప్రజలకు మెరుగైన సేవలు అందించే దిశగా సచివాలయ కార్యదర్శులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు ఆదేశించారు. స్థానిక కళాక్షేత్రంలో బుధవారం టౌన్ ప్లానింగ్, ఎమినిటీ, శానిటేషన్ సెక్రటరీలతో కమిషనర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయాల ద్వారా అందిస్తున్న సేవలను సమీక్షించారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు, పరిష్కరించాల్సిన సమస్యలు, ఇతర అంశాల విషయంలో సచివాలయ కార్యదర్శులు మరింత బాధ్యతాయుతంగా పనిచేయాలని స్పష్టం చేశారు. విధి నిర్వహణలో ఎటువంటి అలసత్వం వహించినా ఉపేక్షించేది లేదన్నారు. అవసరమైతే వారిపై కఠిన చర్యలు కూడా తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలకు పారదర్శకమైన, జవాబుదారీతనంతో కూడిన సేవలు అందించాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కాకినాడ నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు, డిప్యూటీ కమిషనర్ గుంటూరు శేఖర్, ఎస్ఈ పి.సత్యకుమారి, స్మార్ట్ సిటీ ఎస్ఈ పి.వెంకటరావు,, డీసీపీ హరిదాస్, ఏసీపీ నాగశాస్త్రులు, ఎంహెచ్ఓ డాక్టర్ పృథ్వీ చరణ్, ఈఈ మాధవి, వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.

19న హైందవ ఆధ్యాత్మిక సమ్మేళనం



పోస్టర్‌ను ఆవిష్కరించిన పీఠాధిపతి విజయ శంకరస్వామి

బోట్‌క్లబ్: వివిధ విశ్వాసాల జీవన విధానాలతో సమ్మేళన మైన సనాతన ధర్మం హైందవమని అన్నమయ్య కళాక్షేత్రం పీఠాధిపతి విజయ శంకర స్వామి అన్నారు. స్వయంభు భోగి గణపతి పీఠంలో బుధవారం ఆధ్యాత్మిక సమ్మేళనం పోస్టర్‌ను ఆవిష్కరించారు. తాళ్లపాక అన్నమాచార్యుల జయంతి సందర్భంగా ఈ నెల 19న హైదరాబాద్ బిర్లా సైన్స్ సెంటర్ భాస్కర ఆడిటోరియంలో హిందూ సమ్మేళనం గ్రంథావిష్కరణ జరుగుతున్న సందర్భంగా ఆధ్యాత్మిక ఉపాసకులను స్వయంగా ఆహ్వానిస్తున్నామని చెప్పారు. అన్నమయ్య కళాక్షేత్రం హిందూస్ ఫర్ ప్లూరలిటీ అండ్ ఈక్వలిటీ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో జరిగే ఈ సమ్మేళనానికి ఖదిజ్ఞాసి యోధ సాయి త్రినాథదాసు, జై భారత్ జాతీయ అధికార ప్రతినిధి మల్లికావల్లభ, హిందూ స్రవంతుల ప్రతినిధులు, పీఠాధిపతులు, ఉపాసకులు, ఆధ్యాత్మిక గురువులు, సాధువులు, 12 రాష్ట్రాలకు చెందిన దైవాంశ ప్రముఖులు పాల్గొంటున్నారని సంస్థ జాతీయ కార్యదర్శి రాఘవ దాసు తెలిపారు. ఈ సందర్భంగా పీఠం ఉపాసకులు దూసర్లపూడి రమణరాజు మాట్లాడుతూ ఆధ్యాత్మికత అంటే స్వార్థరహితంగా పూర్వీకులు ఆచరించిన భక్తితత్వంతో కూడుకున్నదన్నారు.

సెలవులకు బై.. స్కూళ్లకు హాయ్..

- నేడు తెరచుకోనున్న బడులు
- విద్యార్థులకు కానుకలు సిద్ధం
- స్టూడెంట్ కిట్లుగా పేరు మార్పు
- మధ్యాహ్న భోజన పథకం సరకుల పంపిణీ పూర్తి



పుస్తకాలను పాఠశాలల పాయింట్ వద్దకు చేర్చే పనిలో ఆర్పీలు

పెద్దాపురం: విద్యార్థులకు వేసవి సెలవులు ఈ నెల 12తో ముగియడంతో, 13వ తేదీ నుంచి బడులు తెరచుకునేలా విద్యా శాఖ యంత్రాంగం అన్ని చర్యలు చేపట్టింది. స్కూళ్లు తెరచుకునే సరికి అన్ని పాఠశాలల ప్రాంగణం, పరిసరాలు, తరగతి గదులు, వంటగది, తాగునీటి ట్యాంక్ వంటివి పరిశుభ్రంగా ఉండేలా డీఈఓ ఆయా పాఠశాలల ఉపాధ్యాయులకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు. మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించిన బియ్యం, కోడిగుడ్లు, చిక్కీలు వంటివి ఇప్పటికే పాఠశాలల పాయింట్ల వద్దకు చేరుకుంటున్నాయి. పాఠశాలలకు 13వ తేదీనే వచ్చే పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు వంటి కిట్లు ఆయా స్కూళ్ల పాయింట్ వద్దే అందించేలా విద్యా శాఖ అధికారులు చర్యలు చేపట్టారు.

నూరు శాతం పంపిణీ

గత ప్రభుత్వ హయాంలో ఒకటి నుంచి పదో తరగతి విద్యార్థులకు జగనన్న విద్యా కానుక పేరుతో ఏటా ప్రభుత్వ విద్యార్థులకు విద్యా సామగ్రిని అందించేది. వీటిలో పాఠ్య, నోట్ పుస్తకాలు, స్కూల్ బ్యాగ్, మూడు జతల యూనిఫాం, జత బూట్లు, రెండు జతల సాక్సులు, బెల్ట్, ఇంగ్లిష్ డిక్షనరీ పంపిణీ చేసేవారు. ప్రభుత్వం మారడంతో జగనన్న విద్యా కానుక పేరును తొలగించి, స్టూడెంట్ కిట్లుగా పేరు మారుస్తూ ప్రస్తుత ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్టు విద్యాశాఖ అధికారులు లిఖిత పూర్వక ఆదేశాలు అందించినట్టు చెబుతున్నారు.

నూరు శాతం కిట్లు

పెద్దాపురంలో 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి 8,480. మంది విద్యార్థులకు నూరు శాతం స్టూడెంట్ కిట్లు అందించాలని ఆయా మండల విద్యా శాఖాధికారులకు ప్రతిపాదనలు పంపినట్టు సిబ్బంది తెలిపారు. ప్రస్తుతానికి మండల స్టాక్ పాయింట్‌కు నోట్, పాఠ్య పుస్తకాలు మాత్రమే చేరాయి. ఆ స్టాకును 13వ తేదీకి మండలంలోని ఆయా పాఠశాలల స్టాక్ పాయింట్ వద్దకు చేరేలా అధికారులు చర్యలు తీసుకున్నారు.

విద్యా శాఖ సూచనలు

- తరగతి గదులు, వంటగది, స్టోర్ రూమ్‌లను ఆయాల సహకారంతో పరిశుభ్రం చెయ్యాలి.
- వంట గదిలో గోడల మధ్య బూజులు, బొద్దింకలు, ఎలుకలు వంటివి లేకుండా ప్రధానోపాధ్యాయులు చర్యలు తీసుకోవాలి.
- పాఠశాలల పాయింట్ల వద్దకు వస్తున్న కోడిగుడ్లు, చిక్కీలు, రాగి, బెల్లంపిండి నిల్వ ఉన్నట్టు తెలిస్తే హెచ్ఎంలు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలి.
- మంచినీటి సరఫరాకు సంబంధించి ఓవర్ హెడ్, పంపు ట్యాంక్‌ల్లో నిల్వ ఉన్న నీటిని పూర్తిగా తొలగించి, క్లోరినేషన్‌తో క్లీన్ చేయించాలి.
- టాయిలెట్లు, మరుగుదొడ్ల క్లీనింగ్ విషయంలో ఆయాలతో పాఠశాలలకు సరఫరా చేసిన కెమికల్స్ వినియోగించేలా చర్యలు తీసుకోవాలి.
- మధ్యాహ్న భోజన పథకం, టాయిలెట్ మేనేజ్‌మెంట్ ఫండ్ రిజిస్టర్లు క్రమం తప్పకుండా నిర్వహణను 13వ తేదీ నుంచే చేపట్టాలి.

సరకుల పంపిణీకి చర్యలు



మధ్యాహ్న భోజన పథకం సరకులన్నీ పాఠశాలలకు సకాలంలో చేరేలా అన్ని చర్యలు చేపట్టాం. జూన్‌లో ఇండెంట్ ప్రకారం బియ్యం, కోడిగుడ్లు, చిక్కీలు, రాగి, బెల్లంపిండి చేరుకునేలా చర్యలు తీసుకున్నాం. డీఈఓ సూచనలు మేరకు పాఠశాలల్లోని తరగతి గదులు, పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా హెచ్ఎంలకు ఆదేశాలు జారీ చేశాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 13వ తేదీ నుంచే స్టూడెంట్ కిట్ల పంపిణీ ప్రారంభిస్తాం.

– శర్మ, ఎంఈఓ, పెద్దాపురం

ముమ్మరంగా ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్



సామర్లకోటలో పిల్లలకు అడ్మిషన్ అందజేస్తున్న ఎంఈఓ శివరామకృష్ణయ్య, హెచ్ఎం సాయిరామకృష్ణ తదితరులు

సామర్లకోట: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్చుకోవడానికి ముమ్మరంగా ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్ హెచ్ఎం తోటకూర సాయిరామకృష్ణ, ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్పెషల్ డ్రైవ్‌ను మండల విద్యా శాఖాధికారి వై.శివరామకృష్ణయ్య బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన సదుపాయాలతో పాటు, విద్యార్థులకు ఉచితంగా పాఠ్య, నోట్ పుస్తకాలు, బ్యాగ్‌లు, యూనిఫారం ఇస్తున్నారని చెప్పారు. దీనితో పాటు విద్యార్థులకు పీఎం మహా పోషణ్ ద్వారా పోషక విలువలతో కూడిన మధ్యాహ్న భోజన పథకం అమలు జరుగుతుందని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను సద్వినియోగం చేసుకోవడానికి తమ పిల్లలను ఆ స్కూళ్లలో చేర్పాలని కోరారు. గురువారం నుంచి పాఠశాలలు తెరచుకుంటాయన్నారు. ఈ స్పెషల్ డ్రైవ్‌లో ఉపాధ్యాయులు ఏఎల్‌వీ కుమారి, తాళ్లూరి వైకుంఠం, కె శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సుకు బ్రేకులు ఫెయిల్



జగ్గంపేట బస్టాండ్‌లో ప్లాట్ ఫారంపైకి దూసుకొచ్చిన బస్సు, గాయపడిన మహిళ

జగ్గంపేట: బ్రేకులు ఫెయిల్ కావడంతో స్థానిక బస్టాండ్‌లో బుధవారం ఆర్టీసీ బస్సు అదుపు తప్పింది. కాంప్లెక్స్‌లోకి వచ్చిన ఆర్టీసీ బస్సు నేరుగా ప్లాట్ ఫారంపైకి దూసుకొచ్చింది. అక్కడున్న ఐరన్ గ్రిల్స్‌ను ఢీకొని ఆగిపోయింది. ఈ సంఘటనలో సామర్లకోట మండలం గొంచాల గ్రామానికి చెందిన 60 ఏళ్ల మోర్త సుబ్బయ్యమ్మ తీవ్రంగా గాయపడింది. ఆమె కాలికి బలమైన గాయమైనట్టు స్థానికులు తెలిపారు. ప్లాట్ ఫారంపై ఐరన్ గ్రిల్స్ లేకపోతే ప్రాణాపాయం జరిగేదని అంటున్నారు. క్షతగాత్రురాలిని చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

గర్భిణులు, చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు

గొల్లప్రోలు: మండలంలోని తాటిపర్తిలో గర్భిణులు, చిన్న పిల్లలకు బుధవారం వ్యాధి నిరోధక టీకాలు వేశారు. గొల్లప్రోలు పీహెచ్‌సీ సిబ్బంది ఇళ్లకు వెళ్లి గర్భిణులు, చంటి పిల్లలకు వ్యాధులు రాకుండా వ్యాక్సిన్ వేశారు. పిల్లల ఆరోగ్యంపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. నేరుగా బాలింతల ఇళ్లకు వెళ్లి తల్లి, బిడ్డల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని, వారికి అవసరమైన టీకాలు వేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్టు గొల్లప్రోలు పీహెచ్‌సీ సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.